సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025




...ప్రవేశ పరీక్షకు వేళాయె..
మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.



ఏజెంట్ వేధింపులతో ఆత్మహత్య
తమ కుమారుడి ఆత్మహత్యకు కారకుడైన ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని మొగలికుదురుకు చెందిన దంపతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

8లో

సాగుకు 8,600 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

'చలో తుని'కి వెళ్లనీయకుండా పోలీస్ ఆంక్షలు

వైఎస్సార్ సీపీ నేతలకు నోటీసులు


చలో తుని కార్యక్రమానికి వెళ్లకుండా ఇచ్చిన నోటీసు

అమలాపురం టౌన్: తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్య విరుద్ధంగా ప్రవర్తిస్తున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మంగళవారం ఇచ్చిన చలో తుని కార్యక్రమానికి అమలాపురం నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు వెళ్లనీయకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పలువురి పార్టీ నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. చలో తుని కార్యక్రమానికి అనుమతులు లేని దృష్ట్యా ఎవరూ ఆ కార్యక్రమానికి వెళ్లవద్దని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఒక వేళ అనుమతులు లేని ఆ కార్యక్రమానికి అమలాపురం నియోజకవర్గం నుంచి ఎవరైనా వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలోని అమలాపురం పట్టణ, మూడు మండలాల పార్టీ అధ్యక్షులకు పోలీసులు నోటీసులు జారీ చేసి తుని వెళ్లకుండా కట్టడి చేశారు. అమలాపురం పట్టణ, రూరల్ సీఐలు పి.వీరబాబు, డి. ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆంక్షలు, నోటీసులు అమలయ్యాయి.

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు హౌస్ అరెస్ట్
రావులపాలెం: మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావును మంగళవారం రావులపాలెంలో ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కాకి నాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా చలో తుని కార్యక్రమానికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో అక్కడ వెళ్ళకుండా ముందస్తుగా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

'తెలుగు వ్యాకరణం' పుస్తకావిష్కరణ


తెలుగు వ్యాకరణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఐఈవో సోమశేఖరరావు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి రచించిన 'తెలుగు వ్యాకరణం' పుస్తకాన్ని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యా శాఖాధికారి (డీఐఈవో) వనుము సోమశేఖరరావు మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గల తన కార్యాలయంలో డీఐఈవో సోమశేఖరరావు ఆ పుస్తకాన్ని ఆవిష్కరించి పుస్తక రూపకర్త నరసింహమూర్తిని అభినందించారు. ఆ పుస్తకాన్ని సమీక్షించిన డీఐఈవో సోమశేఖరరావు మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ వ్యాకరణ పుస్తకాలను ఉచితంగా అందిస్తున్న నరసింహమూర్తి అభినందనీయుడన్నారు. తెలుగు అధ్యాపకునిగానే కాకుండా కవిగా, సాహితీవేత్తగా నరసింహరావు నాలుగు దశాబ్దాలుగా తెలుగు భాష వికాసానికి తన వంతు కృషి చేస్తున్నారని చెప్పారు. పుస్తక రూపకర్త నరసింహరావు మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు పద్యాలు, పద్య భావాలు, పద దోషాలు, ఏక వాక్య పద రూప సమాధానాలు ఈ పుస్తకంలో రూపొందించినట్లు తెలిపారు.

బాలాజీ హుండీ ఆదాయం రూ.43.30 లక్షలు


అప్పనపల్లి హుండీ కౌంటింగ్ లెక్కింపు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. స్వామివారికి హుండీల ద్వారా 68 రోజులకు రూ.43,30,182 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 13 గ్రాములు బంగారం, 130 గ్రాములు వెండిని భక్తులు హుండీల్లో కానుకలుగా సమర్పించారన్నారు. అమలాపురం దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు జె.రామ లింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. బ్యాంకు ఉద్యోగులు, స్థానికులు, ఆలయ ఉద్యోగులు, పలు సంస్థలకు చెందిన సేవకులు లెక్కింపులో పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం సమీపాన మోహరించిన టీడీపీ మూకలు


తమ కౌన్సిలర్లకు భద్రత కల్పించి, పోలింగుకు పంపించాలని అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తునిలో గూండాగిరీ

ప్రజాస్వామ్యంపై తుని పట్టణంలో కొద్ది రోజులుగా క్రూర పరిహాసం జరుగుతోంది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క కౌన్సిలర్‌ను కూడా గెలిపించుకోలేని స్థాయిలో ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకున్న టీడీపీ.. ఆ పురపాలికలో చిన్నపాటి 'ఏలిక' పదవి కోసం అడ్డమైన దారులూ తొక్కుతోంది. ప్రజాస్వామిక విలువలను, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని, ఎన్నికల నిబంధనలను అడ్డగోలుగా కాలరాసి.. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ గూండాగిరీకి తెగబడుతోంది. ప్రజలు ఎన్నుకున్న కౌన్సిలర్లపై దాడులకు దిగుతూ, వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ ఎలాగైనా మున్సిపాలిటీలో తిష్ట వేయడానికి కుట్ర పూరితంగా ప్రయత్నాలు సాగిస్తోంది. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా.. అధికార యంత్రాంగం అధికార మదానికి తల వంచి, చేష్టలుడిగి చూస్తూండటం ప్రజాస్వామిక వాదులను నివ్వెరపరుస్తోంది.

- ప్రజాస్వామ్యంపై క్రూర పరిహాసం
- మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను మరోసారి అడ్డుకున్న టీడీపీ
- పోలీసుల సమక్షంలోనే రెచ్చిపోయిన 'పచ్చ' గూండాలు
- కౌన్సిలర్లపై దాడికి యత్నం
- భయంతో పరుగు తీసిన కౌన్సిలర్లు
- కోరం లేక నాలుగోసారీ ఎన్నిక వాయిదా

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తునిలో తెలుగుదేశం పార్టీ గుండాగిరీ రాజ్యమేలుతోంది. పోలీసు సహా అధికార వ్యవస్థలన్నీ ఆ పార్టీ నేతలకు జీహుజూర్ అంటూ, వారు చెప్పినట్టే నడుచుకుంటున్నాయి. ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని టీడీపీ నేతలు తమ చెప్పుచేతల్లో ఉంచుకుని, తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను ఇప్పటికే మూడుసార్లు వాయిదా వేయించిన విషయం తెలిసిందే. అదే క్రమంలో టీడీపీ అరాచకవాదులు మంగళవారం మరోసారి దౌర్జన్యకాండకు తెగబడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన వైస్ చైర్మన్ ఎన్నికను నాలుగోసారి కూడా వాయిదా వేయించారు.

కౌన్సిలర్లపై ముకుమ్మడి దాడి
తుని మున్సిపల్ కౌన్సిల్ వేదికగా జిల్లా స్థాయి అధికారులు, పోలీసులు, టీడీపీ నేతలు వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా డ్రామాను రక్తి కట్టించారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ప్రశాంత వాతావరణంలో ఎన్నిక జరిగేలా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.


టీడీపీ మూకల దాడితో పరుగు తీస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

పోలీసు రక్షణ బాధ్యతలను జిల్లా అదనపు ఎస్పీ ఎంవీజే భాస్కరరావు, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి దేవరాజ్ మనీష్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజుకు అప్పజెప్పారు. తద్వారా కౌన్సిలర్లు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనేలా రక్షణ కల్పిస్తామని జిల్లా యంత్రాంగం చెప్పింది. ఆ భరోసాతో కౌన్సిల్ హాలుకు ఓటింగ్‌కు బయలుదేరిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపై టీడీపీ శ్రేణులు తమ కుట్రలో భాగంగా మూకుమ్మడిగా దాడికి దిగాయి. దీనికి పోలీసులు కూడా సహకరించారనే విమర్శలు వస్తున్నాయి. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను కౌన్సిల్ హాలుకు 200 మీటర్ల దూరాన పోస్టాఫీసు వీధిలో ఉన్న పిఠాపురం డాక్టర్ ఆస్పత్రి దాటి ముందుకు రాకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. **కానీ, టీడీపీ శ్రేణులను మాత్రం కౌన్సిల్ హాలు దగ్గర వరకూ అనుమతించి, 'పచ్చ'పాత ధోరణి చూపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు తొలగించి మరీ 'పచ్చ' గూండాలు.. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల పైకి** దూసుకుపోతున్నా పోలీసులు చేష్టలుడిగి చూశారే తప్ప నిలువరించిన దాఖలాలు కనిపించ లేదు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు రక్షణ కల్పిస్తామన్న జిల్లా యంత్రాంగం మాటలు చివరకు గాలిలో కలసిపోయాయి.

'చలో తుని' అడ్డగింపు
తునిలో అధికార టీడీపీ అరాచకాన్ని నిరసిస్తూ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఇచ్చిన 'చలో తుని' పిలుపునకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్పందించాయి. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో పార్టీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కో ఆర్డినేటర్లు భారీ సంఖ్యలో తుని తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. సోమవారం అర్ధ రాత్రి దాటాక పోలీసులు ఎక్కడికక్కడ పార్టీ ముఖ్య నేతలకు 41 నోటీసులు జారీ చేసి, తెల్లారేసరికి హౌస్ అరెస్టులు చేశారు. నియోజకవర్గాల నుంచి తుని బయలుదేరిన నేతలను మార్గం మధ్యలో అడ్డుకున్నారు.

టీడీపీ 'అధికార' దుర్వినియోగం

గత మున్సిపల్ ఎన్నికల్లో అత్యంత ప్రజాదరణతో 30కి 30 కౌన్సిలర్ స్థానాలనూ వైఎస్సార్ సీపీ గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా గెలుచుకోని టీడీపీ.. ప్రస్తుతం తునిలో అరాచకాలకు పాల్పడుతోంది. వారికి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని, ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించినా ఎన్నిక ప్రశాంతంగా జరిపించలేక చేతులెత్తేయడం విచిత్రం. ఈ ఎన్నిక సందర్భంగా **టీడీపీ అధికార** దుర్వినియోగం తునిలో **అడుగడుగునా కొట్టొచ్చినట్టు** కనిపించింది.

- **గొల్లప్రోలు టోల్**‌ప్లాజా వద్ద పార్టీ ఉత్తరాంధ్ర **ప్రాంతీయ సమన్వ**యకర్త, మాజీ మంత్రి కుర**సాల కన్నబాబు,** ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ **ఎమ్మెల్యే ద్వారం**పూడి చంద్రశేఖరరెడ్డి తదితరు**లను పోలీసులు** అడ్డుకున్నారు. ఇరుపక్షాల మధ్య **వాగ్వాదం చోటు**చేసుకుంది.
- **జగ్గంపేట నియోజకవర్గం** నుంచి బయలుదేరిన **మాజీ మంత్రి,** పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నర**సింహం, యువ** నాయకుడు తోట రాంజీ, వైఎ**స్సార్ సీపీ నాయ**కులు, కార్యకర్తలను తుని రైల్వే **చెక్ పోస్ట్ వద్ద** పోలీసులు అడ్డుకున్నారు. దీంతో **వైఎస్సార్ సీపీ నా**యకులు, పోలీసుల మధ్య కొం**తసేపు వాగ్వాదం** చోటుచేసుకుంది.
- మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు పార్టీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తదితరులను తుని రైల్వే గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు.
- రాజమహేంద్రవరంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం సమన్వయకర్త జక్కంపూడి గణేష్‌లను పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ శ్రేణులు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని పార్టీ కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకుని తీరుపై నిరసన తెలిపారు. రాజాను అరెస్టు చేశారనే సమాచారంతో మాజీ మంత్రి, చెల్లుబోయిన వేణు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్‌లు ఆయనఇంటికి వెళ్లగా పోలీసులు నిర్బంధించారు.
- రాజోలు కో ఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును రావులపాలెం వద్ద, పి గన్నవరం కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావును అయినవిల్లిలోను హౌస్ అరెస్టు చేశారు.

కార్డ్ 2.0తో 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్

జిల్లా రిజిస్ట్రార్ నాగ లింగేశ్వరరావు

అమలాపురం టౌన్: తమ శాఖలో అమలవుతున్న కార్డ్ 2.0 విధానం వల్ల కేవలం 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి ఆస్తుల క్రయ విక్రయదారులను పంపిస్తున్నామని జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్. నాగ లింగేశ్వరరావు స్పష్టం చేశారు. అమలాపురం రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అమలాపురం రిజిస్ట్రార్ -1 శ్రీలక్ష్మి, రిజిస్ట్రార్ -2 లక్ష్మణరాజుతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై చర్చించారు. కార్డ్ 2.0 విధానం అమలవుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం పట్టణం, పరిసర గ్రామాల్లో రియల్ ఎస్టేట్‌లు నిర్వహిస్తున్న బిల్డర్లతో సమావేశం ఏర్పాటుచేసి చర్చించారు. కార్డ్ 2.0 విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన బిల్డర్లకు సూచించారు.

కన్వర్షన్ సమస్యలపై జిల్లా అధికారికి ఏకరువు
ఎకరా భూమిలో 10 సెంట్లు కన్వర్షన్ అయితే ఆ భూమి మొత్తం గజాల్లో పరిగణించడం వల్ల ప్రజలు నష్టపోతున్నారని బిల్డర్లు జిల్లా అధికారి నాగ లింగేశ్వరరావుకు వివరించారు. భూమిని కన్వర్షన్ చేయడంలో కూడా రెవెన్యూ అధికారులు పెడుతున్న ఆంక్షలు, చేస్తున్న ఆలస్యం వల్ల తాము నష్టపోతున్నామని బిల్డర్లు పేర్కొన్నారు. ఆరు నెలలకు కూడా కన్వర్షన్ చేయడం లేదని వివరించారు. కన్వర్షన్ పరంగా బిల్డర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని నాగ లింగేశ్వరరావు స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయిన ప్లాట్లకు పన్ను విధించే విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను కూడా జిల్లా అధికారుల దృష్టికి బిల్డర్లు తీసుకుని వచ్చారు. రెవెన్యూ ఉన్నతాధికారులతో మీ ఇబ్బందులు, సమస్యలపై చర్చిస్తామని నాగ లింగేశ్వరరావు స్పష్టం చేశారు. బిల్డర్లు చిక్కాల గణేష్, కల్వకొలను తాతాజీ, సుంకర నాయుడు, అరిగెల బుజ్జి, చింతపల్లి చిన్నా, మండేల బాబి, ఆశెట్టి ఆదిబాబు, ముద్రగడ తాసు, ఎరుబండి నాని జిల్లా రిజిస్ట్రార్‌తో మాట్లాడారు.


అమలాపురంలో ఆస్తుల క్రయ విక్రయాలను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ నాగ లింగేశ్వరరావు

నేరాల అదుపుపై ఎస్పీ సమీక్ష

అమలాపురం టౌన్: జిల్లాలో నేరాల అదుపు, పెండింగ్ కేసులపై ఎస్పీ బి.కృష్ణారావు చర్చించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో మంగళవారంజరిగిన జిల్లా నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ పలు నేరాల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలకు సూచించారు. పెండింగ్ కేసుల్లో జాప్యాన్ని నివారిస్తూ పురోగతి ఉండాలన్నారు. జిల్లాలో చోరీ కేసుల అదుపుపై చర్చించారు. ఆయా పోలీస్ డివిజన్ ప్రాంతాల్లో చోరీలను నిరోధించేందుకు ప్రణాళికబద్ధంగా నిఘాను పెంచాలని సూచించారు. పోలీస్ సబ్ డివిజన్లు, సర్కిళ్ల వారీగా ఎస్పీ నేర సమీక్ష చేశారు. ఏఎస్పీ ప్రసాద్‌తోపాటు అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం డీఎస్పీలు టీఎస్ఆర్‌కే ప్రసాద్, సుంకర మురళీమోహన్, డి.రఘువీర్, సీఐలు పి.వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్, మోహన్ కుమార్, శేఖర్‌బాబు, విద్యాసాగర్, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని ఎస్సైలు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

చమురు సంస్థలపై పోరాటానికి సిద్ధం

అమలాపురం టౌన్: కేజీ బేసిన్ పేరిట గత 30 ఏళ్లుగా ఈ ప్రాంత భూముల్లోకి వేలాది అడుగుల లోతు కెమికల్స్ పంపిస్తూ విధ్వంసం సృష్టిస్తున్న చమురు సంస్థలపై యాంటీ పొల్యూషన్ సొసైటీ ద్వారా అనేక పోరాటాలు చేస్తూనే ఉన్నామని సొసైటీ కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు స్పష్టం చేశారు. తాను స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీ అయిన క్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులను, ప్రజా సంఘాలు, రాజకీయాలకు అతీతంగా పార్టీలను కలుపుకుని చమురు సంస్థలపై ఇక నుంచి పోరాటాలు చేసేందుకు ఓ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నానని చెప్పారు. అమలాపురం హైస్కూలు సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓఎన్జీసీ, గెయిల్, రిలయన్స్, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్, వేదాంత తదితర చమురు సంస్థలు తమ కార్యకలాపాలతో ఇక్కడి భూమిని గుల్ల చూస్తూ తిరిగి ఆ ప్రాంత అభివృద్ధికి అరకొర నిధులు విదుపుతున్నాయని ఆరోపించారు. తమ ఉత్పత్తులు, భారీ వాహనాల రాకపోకల వల్ల కేజీ బేసిన్‌లో రోడ్లు, వంతెనల జీవిత కాలాన్ని చమురు సంస్థలు హరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐకి చెందిన రాష్ట్ర, జిల్లా నాయకులు కాకినాడలో ఆదివారం చమురు సంస్థల విధ్వంసకర ఘటనలపై పార్టీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ప్రకటించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. వచ్చే ఆదివారం కాకినాడలో సీపీఐ ఇదే డిమాండ్‌పై చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి అన్ని పార్టీల, ప్రజా సంఘాల నుంచి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, బాబి గ్రాబియేల్ పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

క్రీడలతోపాటు క్రమశిక్షణ



పీఈటీల సెమినార్‌లో జేసీ నిషాంతి

సాక్షి, అమలాపురం: పాఠశాల విద్యార్థులకు క్రీడలు నేర్పించడమే కాకుండా క్రమశిక్షణ అలవరచడంలో వ్యాయామోపాధ్యాయుల పాత్ర కీలకమని, వారు తమ వృత్తికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తే దేశానికి ఆరోగ్యవంతమైన మంచి విద్యార్థులను అందించిన వారవుతారని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జిల్లాస్థాయి వ్యాయామోపాధ్యాయుల సెమినార్ మంగళవారం జరిగింది. జిల్లా ఏర్పడిన తరువాత నూతన ఒరవడికి నాంది పలుకుతూ వ్యాయామ విద్య ఆవశ్యకతను తెలియజేసేందుకు నిర్వహించిన సెమినార్‌కు జిల్లాస్థాయిలో 237 మంది హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.ఎల్.ఎన్.రాజకుమారి మాట్లాడుతూ విద్యతో పాటుగా క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో వ్యాయామానికి సమయం కేటాయించాల్సి ఉందన్నారు. కొంతమంది రెగ్యులర్ పీఈటీలు, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న పీఈటీలు పద్ధతి మార్చుకోవాలని డీఈవో సలీంబాషా సూచించారు. సమయ పాలన, విధి నిర్వహణలో అలసత్వం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లా రెండవ అదనపు జడ్జి వి.నరేష్, ఉప విద్యా శాఖ అధికారి పి.వి.సుబ్రహ్మణ్యం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అడబాల శ్రీనివాస్, పీఈటీల సంఘం ప్రతినిధులు సీహెచ్.వి.ఎస్.ప్రసాద్, బి.ఎస్.ఎన్.మూర్తి, ఉండ్రు ముసలయ్య పాల్గొన్నారు.

పీడీ ముసలయ్యకు సన్మానం
అమలాపురం రూరల్: ఈ నెల 28న పదవీ విరమణ చేస్తున్న అల్లవరం మండలం కొడూరుపాడు ఉన్నత పాఠశాల పీడీ ముసలయ్యను డీఈవో బాషాతో పాటు వ్యాయామోపాధ్యాయుల సంఘం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అమలాపురం వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షునిగా ముసలయ్య విలువైన సేవలు అందించారన్నారు. ఎంతోమంది పాఠశాల విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ముసలయ్య జిల్లాలో జరిగిన పలు క్రీడా పోటీలలో ముఖ్య భూమిక పోషించారన్నారు.

రండి బాబూ... రండి

- క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
- రైలు.. బస్సు టికెట్‌లు ఉచితంగా పొందండి
- ఓటు వేసేందుకు సొంత ఊర్లకు రండి
- దూర ప్రాంత వాసులకు కూటమి అనుకూల నేతల ఆఫర్
- పట్టభద్రుల ఎన్నికలకు తాయిలాలు
- సుదూర ప్రాంతాల వారికి ఉచిత రవాణా ఎర

సాక్షి, అమలాపురం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలలో రోజులు గడుస్తున్న కొద్దీ గెలుపు ధీమా తగ్గిపోతుండడంతో కూటమి నేతలు ఓటర్ల ప్రసన్నం కోసం కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం సుదూర ప్రాంతాలలో ఉంటున్న స్థానిక ఓటర్లకు గాలం వేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై వంటి ప్రాంతాలతో పాటు రాష్ట్రంలో తిరుపతి, గుంటూరు, విశాఖపట్నంలో ఉంటున్న వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో పట్టభద్రుల ఓట్లు 3,15,261 వరకు ఉన్నాయి. వీరిలో 22 శాతం నుంచి 25 శాతం వరకు ఇతర ప్రాంతాలలో ఉన్నారని అంచనా. మొత్తం ఓటర్లలో సుమారు 75 వేల మంది వరకు ఇతర ప్రాంతాల్లో ఉండగా, వీరిలో 50 వేల మంది వరకు హైదరాబాద్‌లోనే ఉంటున్నారు.

ప్రతి ఓటు కీలకంగా మారడంతో వీరిలో తమకు అనుకూలంగా ఉండేవారిని రప్పించేందుకు కూటమి నేతలు యత్నాలు ప్రారంభించారు. ఓటర్ల సెల్ ఫోన్లకు వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌లను పంపిస్తున్నారు. అలాగే సంప్రదించాల్సిన నంబర్లు కూడా ఇస్తున్నారు. తమ పేరు బయటకు రాకుండా కూటమి పార్టీలతో పెద్దగా పరిచయం లేనివారి సెల్ నంబర్లు ఇస్తున్నారు. వీటిని స్కాన్ చేస్తే సంబంధించి వ్యక్తులు వీరితో మాట్లాడి రైళ్ల, బస్సుల మీద తీసుకువచ్చే ఏర్పాట్లు చేయనున్నారు. రైల్వే రిజర్వేషన్లు నిండుకోవడం, తాత్కాల్ టిక్కెట్‌లు పెద్ద ఎత్తున చేయడం సాధ్యం కానందున ఆలస్యంగా స్కాన్ చేసిన వారిని బస్సుల మీద తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి నేతలు ఇచ్చిన ఈ ఆఫర్ ఈనెల 16వ తేదీతో ముగిసిపోయింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపు సునాయాసం కాదని, క్షేత్రస్థాయిలో పలుచోట్ల ఓటర్లు వ్యతిరేకంగా ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చి చెప్పారు. ఆదివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్న విషయం తెలిసిందే. దీనితో క్యూ ఆర్ కోడ్ గడువును పెంచినట్టు సమాచారం.



ఓటర్లకు పంపిస్తున్న కూఆర్ కోడ్, వాట్సాప్ సంబర్లు

గల్ఫ్ దోపిడీకి చెక్ పెట్టేందుకు హెల్ప్‌డెస్క్


గల్ఫ్ ఉద్యోగాల సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

అమలాపురం రూరల్: గల్ఫ్ దేశాలలో ఉపాధి లభిస్తే ఆర్థికంగా కుటుంబాలు నిలదొక్కుకునే అవకాశం ఉంటుందన్న ఆశతో అప్పు చేసి ఏజెంట్లు చేతిలో డబ్బు పెట్టి మోసపోతున్నారని, అటువంటి బాధితుల కోసం కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు, వెళ్లి మోసపోయిన వారు, ఏజెంట్లతో గల్ఫ్ ఉద్యోగాలపై మంగళవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏజెంట్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో వాటికి చెక్ పెట్టేందుకు హెల్ప్‌డెస్క్‌ను నెలకొల్పనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆరు మాసాలుగా నిరుద్యోగుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. కలెక్టరేట్‌లో15 రోజుల్లో ఏడుగురు సిబ్బందితో హెల్ప్ డెస్క్ ప్రారంభిస్తామన్నారు. ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ ఈ హెల్ప్ డెస్క్ యువతకు వరంగా నిలుస్తుందన్నారు. వలసదారుల రక్షణ చట్టం హైదరాబాద్ ప్రతినిధి అంగర రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, వికాస పీపీ కె.లచ్చారావు, డీఎస్‌డీఓ హరిశేషు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పాల్గొన్నారు.

పరిష్కారాలు చూపాలి
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులపై స్పందించి సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి భూ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అంశాలపై సమీక్షించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 - 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

బాలికపై అత్యాచారం చేసిన ఘటనపై పోక్సో

మండపేట: పట్టణంలో పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థినిని ఆటో డ్రైవర్ ట్రాప్‌లోకి దింపి అత్యాచారం చేసిన ఘటన బయట పడింది. దీనిపై బాలిక తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్‌ఐ హరికోటి శాస్త్రి, స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గొల్లపుంత కాలనీలో నివాస ముంటున్న క్రాంతికుమార్ పదో తర గతి చదువు కుంటున్న ఓ బాలికను స్థానిక బురుగుంట చెరువు పార్కులో పరిచయం చేసుకున్నాడు. ఆ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

చాగల్లు: మనవడు దాడి చేసిన ఘటనలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిందని ఎస్సై కె.నరేంద్ర మంగళవారం తెలిపారు. రెండు నెలల క్రితం చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన జాస్తి శశిరేఖ(60) మనవడు ఇంటి బయటకు ఆడుకోవడానికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి ఆలస్యంగా వచ్చాడని ఆమె అతనిని మందలించింది. కోపంతో 11 ఏళ్ల ఆ బాలుడు క్షణికవేశంలో పక్కనే ఉన్న సుత్తితో ఆమె తలపై కొట్టగా, ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై అప్పట్లో కేసు నమోదు చేసి చేశారు. శశిరేఖ సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు వేళాయె..

- ఎంజేపీఏపీ బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల
- 480 మంది విద్యార్థులకు 5వ తరగతిలో ప్రవేశాలకు అవకాశం
- మార్చి 15 దరఖాస్తుకు తుది గడువు



ద్రాక్షారామలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయం

రాయవరం: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2025–26 విద్యా సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా ఉన్న తొమ్మిది పాఠశాలల్లో 480 మంది విద్యార్థులకు ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా ప్రవేశాలు లభించనున్నాయి. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో 480 సీట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహాలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం వద్ద ఉన్న సమనస బాలుర పాఠశాలలో 80, రామచంద్రపురం బాలికల పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 80, తుని బాలుర పాఠశాలలో 40, పెద్దాపురం బాలుర పాఠశాలలో 40 సీట్లు, ఇటీవల నూతనంగా పిఠాపురంలో ప్రారంభించిన పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి.

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి బాలుర గురుకుల పాఠశాలలో 40, రాజమహేంద్రవరం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 40, కొవ్వూరు బాలుర ఉన్నత పాఠశాలలో 40, గోపాలపురం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 480 సీట్లకు ఎంట్రన్స్ నిర్వహిస్తారు. కోనసీమ జిల్లా సమనస పాఠశాలలో 40 శాతం (32 సీట్లు) మత్స్యకారులకు మాత్రమే కేటాయిస్తారు.

ఆబ్జెక్టివ్ తరహాలో

ఐదవ తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి సంబంధించి ప్రవేశ పరీక్ష 4వ తరగతి స్థాయి పరీక్ష ఉంటుంది. తెలుగు, ఇంగ్లిషు, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై 100 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నపత్రం ఇస్తారు. తెలుగు–15, ఇంగ్లిషు–25, గణితం–30, పరిసరాల విజ్ఞానం నుంచి 30 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్షా సమయం రెండు గంటలు. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ షీట్లో గుర్తించాల్సి ఉంటుంది. జిల్లా యూనిట్‌గా ప్రవేశాలకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులకు వారి సొంత జిల్లాలో మాత్రమే పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రం వివరాలను హాల్ టిక్కెట్‌లో తెలియజేస్తారు. అభ్యర్థులు అర్హతలు పరిశీలించుకుని దరఖాస్తు చేసుకున్న తర్వాత రూ.100 చెల్లించాలి. ఫీజు చెల్లించిన వారికి నంబరును కేటాయిస్తారు. నంబరు ఆధారంగా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్://ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నంబరును పరీక్ష ఫీజు చెల్లించిన వివరాలకు కేటాయించిన కాలమ్‌లో నమోదు చేయాలి.

వచ్చే నెల 15 తుది గడువు

విద్యార్థులు దరఖాస్తులు సమర్పించడానికి మార్చి 15 తుది గడువు. ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించిన తర్వాత ఒక రిఫరెన్స్ నంబర్ ఇస్తారు. నింపిన దరఖాస్తు నమూనా కాపీని ప్రింట్ తీసుకుని ఉంచుకోవాలి. దరఖాస్తు సమయంలో అభ్యర్థి కులధ్రువీకరణ, ఆదాయం, పుట్టినతేదీ, ప్రత్యేక కేటగిరి ధ్రువీకరణ, స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్ పత్రాలు ఒరిజనల్స్ కౌన్సిలింగ్ సమయంలో చూపవలసి ఉంటుంది. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించరాదు. సర్టిఫికెట్లు సమర్పించకుంటే విద్యార్థి ఎంపిక అయినప్పటికీ సీటు కేటాయించరు. పరీక్ష తేదీకి ఏడు రోజులు ముందుగా రిఫరెన్స్ నంబరు ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్లు పోస్టులో లేదా నేరుగా పంపించరు.

దరఖాస్తు నింపే సమయంలో ఈ సూచనలు పాటించాలి

- దరఖాస్తును ఆన్‌లైన్ లో నింపడానికి ముందుగా నమూనా దరఖాస్తును పూరించాలి.

ఎంపిక విధానం ఇలా..

అర్హులైన విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరి, అభ్యర్థి కోరిన పాఠశాల ప్రాధాన్యతల ఆధారంగా ఎంపిక చేస్తారు. సీట్ల కేటాయింపులో రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకుంటారు. సమానమైన ర్యాంక్ ఒకరి కంటే ఎక్కువ మందికి వచ్చినప్పుడు పుట్టిన తేదీ ప్రకారం అధిక వయసు ఉన్న వారికి ప్రాధాన్యమిస్తారు. సమానమైన ర్యాంకు వస్తే, గణితంలో పొందిన మార్కులను పరిగణలోకి తీసుకుంటారు. అప్పుడు కూడా సమానమైన ర్యాంకు వస్తే పరిసరాల విజ్ఞానంలో పొందిన మార్కులను పరిగణలోనికి తీసుకుంటారు. ప్రవేశానికి ఎంపికైన వారికి మాత్రమే కాల్ లెటర్స్, ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారు. మెరిట్ లిస్టు మార్కుల ఆధారంగా మొదటి, రెండవ, మూడవ జాబితాను ఖాళీలను బట్టి ప్రకటిస్తారు.

దరఖాస్తు చేయాలిలా..

బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులకు 9–11 సంవత్సరాల వయసు మించి ఉండాలి. 2014 సెప్టెంబరు ఒకటవ తేదీ నుంచి 2016 ఆగస్టు 31 తేదీ మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9–13 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి. 2013 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్యలో జన్మించి ఉండాలి. విద్యార్థులు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందడానికి ఆ జిల్లాలోని పాఠశాలల్లో చదువుతూ ఉండాలి. గత రెండేళ్లగా నిరంతరంగా (2023–24, 2024–25) చదువుతూ ఉండాలి. విద్యార్థులు సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతిలో 2024–25 విద్యా సంవత్సరంలో చదువుతూ ఉండాలి.

సీబీఎస్‌ఈ విద్యా విధానం అమలు



మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఇంగ్లిషు మీడియం విద్య లభిస్తుంది. 9వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ అమలు చేస్తున్నాం. ప్రాథమిక తరగతుల్లో ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్ అమలు పరుస్తున్నాం.

– డాక్టర్ వైటీఎస్ రాజు, ప్రిన్సిపాల్, ఎంజేపీఏపీబీసీడబ్ల్యుఆర్ స్కూల్, సమనస

సద్వినియోగం చేసుకోవాలి



వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు విడుదలైన నోటిఫికేషన్‌ను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ద్రాక్షారామలో బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతికి 40 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఎంట్రన్స్ పరీక్షలో పాల్గొని విద్యార్థులు మెరిట్ ద్వారా సీటును సంపాదించుకోవాలి.

– వి.పావన్య, ప్రిన్సిపాల్, ఎంజేపీఏపీబీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, ద్రాక్షారామ

- దరఖాస్తుదారులు సొంత జిల్లాలో మాత్రమే పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేయాలి.
- పాఠశాల ప్రాధాన్యతాక్రమం ఎంచుకోవడానికి ముందు పాఠశాలల పట్టిక చూసుకుని పూరించాలి.
- పాస్‌పోర్టు సైజ్ ఫొటోను సిద్ధం చేసుకోవాలి.
- దరఖాస్తు పూరించే సమయంలో జరిగే పొరపాట్లకు విద్యార్థిదే పూర్తి బాధ్యత.
- ఒకసారి దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఎటువంటి మార్పులకు తావులేదు.

హోరాహోరీగా ఆలిండియా హాకీ పోటీలు



పోటీ పడుతున్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో సివిల్ సర్వీసెస్ ఆలిండియా హాకీ పోటీలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. గుజరాత్ సెక్టార్, రాజస్థాన్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 11–2 స్కోర్‌తోను, పుదుచ్చేరి సెక్టార్, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 6–4 స్కోర్‌తోను, ఆర్ఎస్‌బి సిమ్లా, ఆర్ఎస్‌డి జైపూర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్‌బి జైపూర్ 9–2 స్కోర్‌తోను విజయం సాధించాయి. ఆర్ఎస్‌బి ముంబయి, ఆర్ఎస్‌బి చెన్నై మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్‌బి ముంబాయి 5–1స్కోర్‌తో, ఆంధ్రప్రదేశ్ సెక్టార్, గోవా సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 23–0 స్కోర్‌తోను గెలుపొందగా జట్టులోని శ్రీనివాస్‌రావు 6, ఉదయ్‌కుమార్ 7 గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మహిళల విభాగంలో ఒడిశా సెక్టార్, ఢిల్లీ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా సెక్టార్ 16–0 స్కోర్‌తోను, హర్యానా సెక్టార్, తెలంగాణ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా సెక్టార్ 18–0 స్కోర్‌తోను, బిహార్ సెక్టార్, ఉత్తరాఖండ్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బిహార్ సెక్టార్ 7–1 స్కోర్‌తో విజయం సాధించాయి. మంగళవారం నిర్వహించిన మ్యాచ్‌లను కాకినాడ ఆర్‌డీఓ మల్లిబాబు, హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు, డిఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్‌లు పర్యవేక్షించారు.

ఏజెంట్ వేధింపులతో ఆత్మహత్య

- కలెక్టర్, ఎస్పీకి కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన




తారక ముత్యాలరాము కుటుంబ సభ్యులు

మామిడికుదురు: 'ఏజెంట్ వేధింపుల వల్లే మా అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడు. మా అబ్బాయికి ఎదురైన పరిస్థితి మరెవ్వరికీ రాకూడదు. ఏజెంట్‌పై చర్య తీసుకోవాల'ంటూ మొగలికుదురుకు చెందిన నేదూరి సురేష్, రామలక్ష్మి దంపతులు కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావుకు ఈ నెల 15వ తేదీన ఫిర్యాదు చేశారు. మొగలికుదురుకు చెందిన నేదూరి తారక ముత్యాలరాము (24) ఈ నెల 13వ తేదీన కువైట్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహం సోమవారం స్వగ్రామం మొగలికుదురు చేరింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి తల్లిదండ్రులు, మృతుని అన్న ఫణీంద్రకుమార్ తెలిపిన వివరాలు ఇవీ.. మొగలికుదురుకు చెందిన నేదూరి తారక ముత్యాలరాము బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కారు డ్రైవింగ్ కూడా చేసేవాడు. అతను గత ఏడాది డిసెంబర్ 28వ తేదీన కువైట్ బయలు వెళ్లాడు. ఈ ఏడాది జనవరి 1వ తేదీన కువైట్ చేరుకున్నాడు. మామిడికుదురు మండలం కొమరాడకు చెందిన ఏజెంట్ వలవల నాగరాజు ద్వారా అతను కువైట్ వెళ్లాడు. శేఠ్ తనను బాగా చూసుకుంటున్నాడని, తన సహ ఉద్యోగి, రూమ్‌మేట్ అయిన ఏజెంట్ వలవల నాగరాజు తరచు వేధింపులకు గురి చేస్తున్నాడని ఫోన్‌లో తల్లిదండ్రులకు చెప్పేవాడు. రెండు, మూడు సార్లు కొట్టాడు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 1.20 గంటలకు మా అబ్బాయి తనతో మాట్లాడాడని తల్లి రామలక్ష్మి తెలిపారు. అదే రోజు సాయంత్రం 7.18 గంటలకు ఏజెంట్ నాగరాజు నుంచి ఫోన్ వచ్చిందన్నారు. ఏమీ మాట్లాడకుండా ఫోన్ కట్ చేశాడని చెప్పారు. 7.50 గంటల సమయంలో ఏజెంట్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కొమరాడ నుంచి వచ్చి మీ అబ్బాయి కనిపించడం లేదని, దీని వల్ల ఏజెంట్ నాగరాజు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నాడంటూ చెప్పారన్నారు. అప్పటి నుంచి తన కుమారుడి ఫోన్ పని చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 14వ తేదీ ఉదయం 2 గంటల సమయంలో కువైట్‌లో ఉంటున్న తమ బంధువు ద్వారా రాము ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందని ఆవేదనతో చెప్పారు. ఏజెంట్ వేధింపులే తమ కుమారుడి మృతికి కారణమని ఆరోపించారు. మరో వ్యక్తికి ఈ పరిస్థితి ఎదురు కాకూడదని, ఏజెంట్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కువైట్‌లో ఆత్మహత్య చేసుకున్న ముత్యాలరావు (ఫైల్)



నూనె తయారీపై 'తేలి' సినిమా

సీనియర్ నటుడు బాలాజీ



విలేకరులతో మాట్లాడుతున్న నటుడు బాలాజీ

సామర్లకోట: తమ తెలుకుల, గాండ్ల కులస్తులు అనాధిగా తయారు చేస్తున్న నూనె తయారీపై 'తేలి' అనే పేరుతో ప్రత్యేక చిత్రం త్వరలోనే రూపొందించనున్నట్టు సీనియర్ సినీనటుడు మొల్లెటి బాలాజీ తెలిపారు. స్థానిక పంచారామ క్షేత్రాన్ని దర్శించుకున్న సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులకు తన సినిమా అనుభవాలను వెల్లడించారు. 1983వ సంవత్సరంలో తాను ఓ ఆడది మగాడు చిత్రం ద్వారా ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు ప్రోత్సాహంతో చిత్ర సీమలో అడుగుపెట్టానని తెలిపారు. మగమహారాజు, మంగమ్మగారి మనవడు వంటి చిత్రాలు గుర్తింపు తీసుకు వచ్చాయని వివరించారు. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జునలతో కలిసి అనేక చిత్రాలల్లో నటించి ప్రేక్షకుల మన్నలు పొందడం ఆనందంగా ఉన్నదన్నారు. నూనె పుట్టుక, వినియోగం అన్ని వంటకాల్లోనూ, పూజల్లో నూనెకు అంతటి ప్రాధాన్యత దక్కడం వంటి అంశాలపై చిత్రంలో వివరించనున్నట్లు వివరించారు. త్వరలో త్రినేత్ర సినిమాలో కూడా తాను నటిస్తున్నట్లు చెప్పారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తున్నట్లు చెప్పారు. వశిష్ట చిత్రంలో పోలీసు ఆఫీసరుగా నటిస్తున్నట్లు తెలిపారు. 40 ఏళ్ల తన సినీ జీవితంలో అనేక విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. ఇప్పటి వరకు రెండు పర్యాయాలు సామర్లకోట భీమేశ్వరస్వామి వచ్చానన్నారు. సామర్లకోటలో 100 సంవత్సరాలకు పైబడి అంబటి సుబ్బన్న ఆయిల్ పరిశ్రమలో తయారు అవుతున్న నూనె రాష్ట్ర వ్యాప్తంగా అందించడానికి చేస్తున్న సేవలను బాలాజీ కొనియాడారు.

నృత్యకారుడికి అభినందన

తెలుకుల గాండ్ల కులానికి చెందిన అలమండ ప్రసాద్ అంతర్జాతీయంగా కూచిపూడి నృత్యంలో రాణించడంపై బాలాజీ అభినందించారు. దేశ, విదేశాల్లో ప్రసాద్ నృత్యాలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించడం అభినందనీయమన్నారు. యోగం ఉంటేనే సామర్లకోటలోని యోగ లింగాన్ని దర్శించుకోగలుగుతామని అన్నారు.

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షుడు విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన మంగళవారం జెడ్పీ సమావేశపు మందిరంలో 1, 2, 4, 7 స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. అదే విధంగా 3వ స్థాయీ సంఘ సమావేశం వైఎస్ చైర్‌పర్సన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం సంఘ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, 6వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అధ్యక్షతన నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం నిర్వహించబోయే ఎమ్మెల్సీ ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నిక దృష్ట్యా ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున సమావేశం నిర్వహించినట్లు చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు వివరించారు. ఏవిధమైన శాఖాపరమైన సమీక్షలుగాని, తీర్మానాలుగాని చేయకుండా, ఆమోదించకుండా సమావేశాలు ముగించారు. ఈ సమావేశాలకు జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, ఆయా జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా ప్రజాపరిషత్ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రిలో ఐదుగురు వైద్యులతో సహా

9 మంది సస్పెన్షన్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విధుల్లో నిర్లక్ష్యంగా వహించిన ఈఎస్ఐ ఆసుపత్రిలో 5 గురు వైద్యులతో సహా 9 మందిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ చర్యలు తీసుకున్నారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన విషయం తెలిసిందే. విధులను సక్రమంగా నిర్వహించని కారణంగా ఐదుగురు వైద్యులు, నలుగురు కార్యాలయ సిబ్బంది సస్పెండ్‌కు గురయ్యారు. మంత్రి ఆకస్మిక తనిఖీలో కొందరు వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు చేసుకుని విధులకు హాజరుకాకండా ఆసుపత్రి నుంచి వెళ్లిపోతున్నట్లు గుర్తించారు. హాజరు నమోదు పుస్తకాలను పరిశీలించగా, కొందరు హాజరు నమోదు చేయకపోవడం, కొందరు హాజరు నమోదు చేసి వెంటనే వెళ్లిపోవడం, మరికొందరు సమస్యలకు సరైన సమాధానం ఇవ్వకపోవడం విచారణలో తేలింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్‌ను తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఈఎస్ఐ బీమా చందాదారులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని, రోగుల సంరక్షణలో ఏదైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. దీనిపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం



హిమ రాజేశ్వరి

అమలాపురం టౌన్: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న అల్లవరం గ్రామానికి చెందిన వీరమల్లు హిమ రాజేశ్వరి అదృశ్యమైంది. ఆమె తాను చదువుతున్న కళాశాల నుంచి సాయంత్రం 3.10 గంటలకు వెళ్లిపోయినట్లు పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థిని తండ్రి వీరమల్లు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. హిమ రాజేశ్వరి ఎత్తు 5 అడుగులు, ఎస్‌కేబీఆర్ కళాశాల యూనిఫాం ధరించింది. తెలుపు రంగు కలిగి ఉంటుంది. ఆమె ఆచూకీ తెలిసిన వారు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు 9440796561, పట్టణ ఎస్సై శ్రీనివాస్ 9848132305, విద్యార్థిని తండ్రి దుర్గా ప్రసాద్ 9949729616 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని పట్టణ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

యువతి ఆత్మహత్య



అరుణ (ఫైల్)

కాకినాడ క్రైం: తల్లిదండ్రులు మందలించారనే వేదనతో ఒక యువతి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే కాకినాడ సూర్యనారాయణపురంనకు చెందిన అనపాల అరుణ (24) స్థానిక వెంకీ రెసిడెన్సీలో హౌస్ కీపర్‌గా పనిచేస్తోంది. ఈమె తరచుగా అప్పులు చేస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆవేదన చెంది ఈ నెల 16వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు కాకినాడ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో కుమార్తె అరుణ అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. కేసు విచారణ కొనసాగుతుండగా మంగళవారం సాయంత్రం జగన్నాథపురం వంతెన కింద ఉన్న ఉప్పుటేరులో మృతదేహం కొట్టుకొచ్చింది.

27న ప్రత్యేక సెలవు

ఏలూరు(మెట్రో): తూర్పు పశ్చిమ గోదావరి జిల్లా నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 27న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటర్లుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

వేగంగా ఫీజుల వసూలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీల ఫీజులు వసూలులో వేగం పెంచి, మార్చినాటికి టార్గెట్‌లు పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్ ఆదేశించారు. మంగళవారం రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీల కార్యదర్శులు, రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 50శాతం లోపు మార్కెట్ ఫీజు వసూలు చేసిన కార్యదర్శులు ఫీజులు వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. మార్కెట్‌యార్డుల్లో పెండింగ్ పనులును త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులు సునీల్‌వినయ్, రాఘవేంద్రరావు, విశాలాక్షి, మార్కెట్ కమిటీ సెక్రటరీలు, ఎస్టేట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇంటెలిజెన్స్ హెచ్‌సీ మృతి



డేవిడ్‌రాజు (ఫైల్)

కొవ్వూరు: ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఈ డేవిడ్‌రాజు (47) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు చాగల్లులోని స్వగృహంలో తెల్లవారు జామున గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి ఈసీజీ తీసిన వైద్యుల సూచనల మేరకు గుండెపోటుగా నిర్ధారించుకుని రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతుండగా మధ్యాహ్నం మరోసారి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఆయనకి భార్య, ముగ్గురు కుమారులున్నారు. ఈయన స్వస్థలం ఏలూరు సమీపంలోని మముదూరు. ఉద్యోగ రీత్యా కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో పని చేస్తూ చాగల్లులో స్వగృహం నిర్మించుకున్నారు.